గురుభ్యోనమః

- నేడు గురుపౌర్ణమి
- ప్రత్యేక పూజలకు ముస్తాబైన సాయిబాబా ఆలయాలు
- వేడుకల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీలు


విద్యుత్ దీపాల వెలుగులు బాలాజీ నగర్ సాయిబాబా ఆలయం


సాయినాథుడు

కర్నూలు కల్చరల్: మన సమాజంలో గురువుకు విశేషమైన స్థానం ఉంది. అజ్ఞాన చీకట్లను జ్ఞానకాంతులతో పారదోలే దివ్య చైతన్య స్ఫూర్తిగా గురువును పిలుస్తారు. అంతటి ఖ్యాతి కలిగిన గురువులను, పెద్దలను పూజించడానికి నిర్ణయించిన తిథి గురుపౌర్ణమి. ప్రతి ఏటా ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున ఈ వేడుక జరుపుకుంటారు. నేడు గురుపౌర్ణమి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున వేడుకలు జరుగనున్నాయి.

ఆది గురువు వ్యాసుడే..

ఒకరి నుంచి ఒకరికి మౌఖికంగా సాగిన వేద జ్ఞానం అంతటినీ ఒకచోటకు చేర్చి నాలుగు విభాగాలుగా విభజించి వేద వాంగ్మయాలను సామాన్యుడి చెంతకే చేరేలా చేయడంలో వ్యాసుడు ఎంతో కృషి చేశాడు. పంచమ వేదంగా పేరు తెచ్చుకున్న మహాభారతాన్ని మనకు అందించిన వ్యాస భగవానుడు జన్మించిన రోజు కాబట్టి ఈ రోజును గురు పౌర్ణిమ లేదా వ్యాస పూర్ణిమగా జరుపుకుంటాం. హిందూ మతంలో గురువును భగవంతునికి భక్తునికి మధ్య సంధాన కర్తగా భావిస్తుంటారు. వేద వ్యాసుని మానవ జాతికంతటికి మంచి ఆధ్యాత్మిక వారసత్వాన్ని మిగిల్చి వెళ్లాడు. అందుకే ఆయన్ను మానవాళికంతటికి గురువుగా భావిస్తుంటారు. వేద వ్యాసుని పూర్వ నామం కృష్ణ ద్వైపాయనుడు. వేద కాలపు సంస్కృతినంతా నాలుగు వేదాల్లో ఆయన సంకలనం చేసిన తరువాతే ఆయన్ను వేదవ్యాసుడిగా పిలవడం ప్రారంభించారు.

గురుపూర్ణిమి రోజు ఇలా..

ఈ రోజున చాలా మంది భక్తులు ఉపవాసం ఉంటారు. సూర్యోదయం వేళ ఉపవాసం ఆరంభించి చంద్రోదయ వేళకు ఉపవాసం ముగిస్తారు. చంద్రోదయాన్ని చూసిన తరువాత లేదా సాయంత్రం పూజలు ముగిసిన తర్వాత ఆహారాన్ని స్వీకరిస్తారు. ఆలయాల్లో నిర్వహించే పూజల్లో పాల్గొని సాయినాథుని దర్శించుకుంటారు.

సాయినాథుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గురుపూర్ణిమ రోజున జిల్లాలోని సాయిబాబా, దత్తాత్రేయుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆషాడ శుద్ధ పున్నమి రోజు నుంచి మూడు రోజుల పాటు ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాల కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కర్నూలు నగరంలోని దక్షిణ షిరిడి సాయిబాబా దేవస్థానంతో పాటు నగరంలోని 22 సాయిబాబా ఆల యాల్లో గురుపౌర్ణమి వేడుకల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే శ్రీ సాయి జయ జయ సాయి అఖండభజనను భక్తులు కొనసాగిస్తున్నారు. అన్ని ఆలయాల్లో అన్న ప్రసాద వితరణ చేయనున్నారు.

గురువును ఆరాధించాలి



దేశంలో ఆషాడ పూర్ణిమ నుంచి నాలుగు మాసాలు చాతుర్మాసం పాటిస్తారు. పూర్వకాలంలో శిష్యులు గురువులు కూడా ఈ నాలుగు మాసాలు వర్షాకాలం అయినందున వ్యాధులు ప్రబలే కాలం కావడంతో ఎలాంటి పర్యటనలు, దేశ సంచారం చేయకుండా ఒకేచోట తాత్కాలికంగా నివాసం ఉంటారు. శిష్యులు గురువుల దగ్గర విజ్ఞాన సముపార్జన చేసేవారు. మొదటి రోజున గురువును ఆరాధించడం ప్రత్యేకంగా ఉండేది. ఈ సంప్రదాయమే కాలక్రమేనా గురుపూర్ణిమగా మారినట్లు చరిత్ర చెబుతుంది. గురు దేవున్ని త్రిమూర్తి స్వరూపంగా ఆరాధించాలనేది రుషి వచనం. అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానాన్ని అందించే గురువును ఎప్పుడూ గౌరవించాలి. – **రాఘవేంద్ర శర్మ, పండితుడు**

క్లుప్తంగా

జిల్లా అవతరణ వేడుకలను ప్రభుత్వమే నిర్వహించాలి


ఇంతియాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న కర్నూలు జిల్లా మేధావుల సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా అవతరించి 165 సంవత్సరాలు అయిన సందర్భంగా జిల్లా అవతరణ దినోత్సవాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని కర్నూలు జిల్లా మేధావుల సంఘం జిల్లా కార్యదర్శి, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ మన్సూర్ రహమాన్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఆదివారం ప్రభుత్వ అదనపు కార్యదర్శి మహ్మద్ ఇంతియాజ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కర్నూలు జిల్లా చరిత్రలో జూలై, అక్టోబర్, నవంబర్ మాసాలు అత్యంత కీలకమైనవని, ఆ మాసాల్లో ఏదో రోజున జిల్లా అవతరణ దినోత్సవ వేడుకలను సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించేలా చూడాలని కోరారు.

బీసీలకు పెద్దపీట

కర్నూలు (న్యూసిటీ): బడుగు, బలహీన వర్గాలకు తెలుగుదేశం పార్టీ పెద్దపీట వేసిందని ఆ పార్టీ కర్నూలు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. ఆదివారం ఆ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు తనపై నమ్మకంతో కర్నూలు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు పదవీ బాధ్యతలు అప్పగించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకెపోగు ప్రభాకర్, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేఈ జగదీష్, నాయకులు పాల్గొన్నారు.

తైక్వాండోలో రాణించాలి


తైక్వాండో క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు

కర్నూలు (రూరల్): విద్యార్థులు తైక్వాండో క్రీడలో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం నగరంలోని పార్థసారధి నగర్‌లోని వైఎస్సార్ పార్క్‌లో తైక్వాండో బెల్ట్ టెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ..... ప్రతి ఒక్కరు తమకు ఇష్టమైన క్రీడలో రాణించాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి ఆరెంజ్, ఎల్లో బెల్ట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో శిక్షకులు రాంబాబు, శివ పాల్గొన్నారు.

తుది దశకు కేజీబీవీ స్కిల్‌టెస్ట్

కర్నూలు సిటీ: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో 202 పోస్టుల భర్తీ కోసం నిర్వహిస్తున్న స్కిల్ టెస్ట్ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఆదివారం మూడు సబ్జెక్టులకు సంబంధించిన అభ్యర్థులకు నైపుణ్య పరీక్షను పెద్దపాడు ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించారు. సోమవారం సీఆర్‌టీ సోషల్, పీజీటీ బొటనీ, ఫిజిక్స్, రేపు(మంగళవారం) పీజీటీ జువాలజీ, సీఆర్‌టీ తెలుగు, పీజీటీ కెమిస్ట్రీ సబ్జెక్టులకు స్కిల్ టెస్ట్ నిర్వహించనున్నారు.

పేదలకు భూపట్టాలివ్వాలి

కర్నూలు(రూరల్): జిల్లా వ్యాప్తంగా పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం కే కే భవనంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కె. వెంకట రాముడు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కండి

కర్నూలు (రూరల్): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం కే కే భవనంలో సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు రామాంజనేయులు, శ్రామిక మహిళ కన్వీనర్ నిర్మల, ప్రభాకర్, నాగేశ్వర రావు, విజయ్, సాయిబాబా నాగరాజు, గోపాల్ దేవరాజు, నరసింహులు, గోపాలు పాల్గొన్నారు.

అలరించిన గాతరహే మేరదిల్


హిందీ గీతాలు ఆలపిస్తున్న గాయకులు అలీ అబ్బాస్, నబీబేగ్‌లు

కర్నూలు కల్చరల్: హైదరాబాద్, బెంగళూరు కళాకారులతో నిర్వహించిన 'గాతరహే మేరదిల్' కార్యక్రమం అలరించింది. సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాయనీ గాయకులు అలీ అబ్బాస్, నబీబేగ్, ఇక్బాల్, విజయలక్ష్మి, ఫయామ్ ఆలపించిన పాటలు హుషారెత్తించాయి. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ నగర ప్రజలు సేద తీరేందుకు కళాక్షేత్రంలో వారాంతం శని ఆదివారాల్లో ఏదో ఒక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కళాక్షేత్రం సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ


పాతబస్టాండ్ పోస్టాఫీసు వద్ద మురుగు కాల్వల పనులను పరిశీలిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని పాతబస్టాండ్, వైఎస్ఆర్ సర్కిల్ వద్ద జరుగుతున్న మురుగు కాల్వల పనులు, సర్కిల్ పనులను కమిషనర్ పరిశీలించారు. అలాగే ఎస్‌టీబీసీ కళాశాల వద్ద, ఓల్డ్ ఎస్పీ బంగ్లా కల్వర్ట్, కొండారెడ్డి బురుజు రోడ్డు డ్రైయిన్, ఫుట్‌పాత్ పనులను తనిఖీ చేశారు. పనుల ప్రగతి గురించి సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్ హుస్సేన్, డీఈఈ నరేష్‌లను అడిగి తెలుసుకున్నారు. మురుగు కాల్వల నిర్మాణాల్లో నాణ్యతను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలో రూ. కోట్లు విలువ చేసే అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఈఈలు రాచయ్య, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ హరీష్ చౌదరి పాల్గొన్నారు.

గురువులు.. జీవిత మార్గదర్శకులు



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ క్షేత్ర ప్రచారక్ సుధీర్

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో నంద్యాల రోడ్‌లోని దేవి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా గురుపూజోత్సవం జరిగింది. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ఆర్ఎస్ఎస్ క్షేత్ర ప్రచారక్ సుధీర్ ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. తల్లిదండ్రుల తరువాత మనం గురువులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు. గురువులు జీవిత మార్గదర్శకులు అన్నారు. వారి అడుగుజాడల్లో నడిచిన వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. సుమేరు ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ధూళిపాళ్ల రమేష్, ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ చాలక్ ఎన్‌వీఎస్ గుప్త, నగర సంఘ చాలక్ డాక్టర్ చల్లా వాసురెడ్డి, పాల్గొన్నారు.

మహావీర్‌నగర్‌లో చైన్ స్నాచింగ్

కర్నూలు(అర్బన్): నగరంలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగులు అపహరించుకువెళ్లారు. మహావీర్‌నగర్‌కు చెందిన వెంకటేశ్వరమ్మ అనే మహిళ ఆదివారం దేవాలయానికి వెళ్లింది. రాత్రి 7.30 గంటల సమయంలో ఇంటికి వెళ్లేందుకు హైవేలో నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని నాలుగున్నర తులాల బంగారు గొలుసును అపహరించుకువెళ్లారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నాలుగో పట్టణ పోలీసులు తెలిపారు.

రక్తదాన కార్యక్రమానికి విశేష స్పందన


రక్తదానం చేస్తున్న మెడికల్ రెప్స్

కర్నూలు(హాస్పిటల్): జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు వెంకట్, కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక మెడికల్ రెప్స్ భవనంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ సురేష్, డాక్టర్ నాగేశ్వరరావు హాజరయ్యారు. శిబిరంలో 30 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రజా ఆరోగ్య వేదిక కన్వీనర్ ప్రసాదశర్మ మాట్లాడుతూ సమాజసేవలో మెడికల్ రెప్రజెంటేటివ్స్ భాగం పంచుకుంటున్నారన్నారు. ముఖ్యంగా ఉచిత వైద్యశిబిరాలు, కోవిడ్ సమయంలో వారు నిర్వహించిన పాత్ర వెలకట్టలేనిదని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కోటేశ్వరరావు, బసవరాజు, జిల్లా నాయకులు మారుతి, శేషాద్రి, ఖలీల్, శివరంగ, రాఘవేంద్ర, సురేంద్ర పాల్గొన్నారు.

ఉమ్మడి సీనియారిటీతోనే పదోన్నతులు కల్పించాలి


మాట్లాడుతున్న గోకారి

కర్నూలు(సిటీ): మండల విద్యాధికారి -1, ఉప విద్యాధికారి పోస్టులను ఉమ్మడి సీనియారిటీతోనే పదోన్నతులు కల్పించాలని ఫ్యాప్టో చైర్మన్ ఎస్ గోకారి, సెక్రెటరీ జనరల్ తిమ్మప్ప కోరారు. ఆదివారం స్థానిక ఎస్‌టీయూ కార్యాలయంలో ఫ్యాప్టో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రెండు లక్షల మంది ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. అందులో 99.2 శాతంగా ఉన్న జెడ్పీ మేనేజ్‌మెంట్ ఉపాధ్యాయులను పక్కనపెట్టి కేవలం 0.08 శాతంగా ఉన్న ప్రభుత్వ యాజమాన్య ఉపాధ్యాయులకు ఎంఈఓ -1, డివిజన్ స్థాయి ఉప విద్యాధికారి పోస్టులను పదోన్నతి కల్పిస్తామనడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. జయరాజ్, ఏపీటీఎఫ్ 1938 జిల్లా అధ్యక్షుడు ఎస్ ఇస్మాయిల్, ఆప్టా జిల్లా ప్రధాన కార్యదర్శి సేవా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో వైద్యుల పాత్ర ఎనలేనిది


సన్మానించిన వైద్యులు, ఆడిటర్లతో లయన్స్ క్లబ్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో వైద్యుల పాత్ర ఎనలేనిదని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మాజీ గవర్నర్ డాక్టర్ బాలమద్దయ్య చెప్పారు. జాతీయ వైద్యుల దినోత్సవం, చార్టెట్ అకౌంటెంట్స్ డే సందర్భంగా ఆదివారం పలువురు వైద్యులు, ఆడిటర్లను సన్మానించారు. ఇందులో డాక్టర్ జయప్రకాష్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ బాలమద్దయ్య, డాక్టర్ వాదిరాజు, ఆడిటర్ బుచ్చన్న, జి. సురేంద్రనారెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలమద్దయ్య మాట్లాడుతూ రేపురా, మరోసారి చూద్దాం అనే మాట మాట్లాడకుండా వచ్చిన ప్రతి రోగికి తగిన విధంగా వైద్యసేవలను వైద్యులు అందిస్తారని కొనియాడారు. ఆడిటర్ బుచ్చన్న మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక స్థిరత్వం చాలా ప్రాధాన్యమైన అంశమని, అలాంటి సేవలను ఆడిటర్ల సహాయంతో పొందాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి లోకేష్, ఎంజేఎఫ్ నాయకులు దుర్గానాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పీవీ రాజ్‌కుమార్, బీవీ రమణగౌడ్, శ్రీనివాసబోస్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ అరుణ్‌కు యంగ్ సైంటిస్ట్ అవార్డు


డాక్టర్ అరుణ్‌ను సన్మానిస్తున్న సంస్థ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలుకు చెందిన హోమియో వైద్యులు డాక్టర్ అరుణ్ కుందవరానికి హోమియో వైద్యంలో చేస్తున్న సేవలకు గాను కౌన్సిల్ ఆఫ్ ఆల్టర్నేటివ్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్, న్యూఢిల్లీ వారు ఇన్నోవేటివ్ యంగ్ సైంటిస్ట్ అవార్డు ప్రకటించారు. వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాల్ చారి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో అపోలో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎ.జగదీష్, డాక్టర్ త్రివిక్రమ్, డాక్టర్ ప్రశాంత్ డాక్టర్ చొక్కపు వెంకటరమణ పాల్గొన్నట్లు డాక్టర్ అరుణ్ తెలిపారు.

అతిసారతోనే పిల్లల మరణాలు


పోస్టర్లు విడుదల చేస్తున్న డీపీహెచ్ఎన్ ఇందిర తదితరులు

కర్నూలు(హాస్పిటల్): పిల్లల మరణానికి అతిసార వ్యాధే ప్రధాన కారణమవుతుందని డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారిణి ఇందిర చెప్పారు. మహిళా ప్రాంగణంలో జరుగుతున్న ఆశాల శిక్షణ కార్యక్రమంలో ఆదివారం ఆమె పాల్గొని మాట్లాడారు. ఐదేళ్లలోపు పిల్లల్లో సంభవిస్తున్న మరణాలకు నీళ్ల విరేచనాలు కూడా ఓ ముఖ్యకారణం కావడంతో నీళ్ల విరేచనాలు, ప్రమాదకర లక్షణాలు, ఓఆర్ఎస్ కలుపుకునే విధానం, ఓఆర్ఎస్ తాగించే విధానం, చేతులు శుభ్రపరుచుకోవడం మొదలైన విషయాలపై తల్లులకు అవగాహన కల్పించాలని కోరారు. బిడ్డకు మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని చెప్పారు. బిడ్డకు ఆహారం తినిపించే ముందు, వంట చేయడానికి ముందు, మలమూత్ర విసర్జన తీసివేసిన తర్వాత చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని తెలిపారు.

యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం


డాక్టర్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న హార్ట్ ఫౌండేషన్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుందని కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి, కార్డియాలజిస్టు డాక్టర్ పి. చంద్రశేఖర్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో డిజిటల్ యుగంలో యోగా పాత్ర అనే అంశంపై ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ కేఈ శ్రీనివాసమూర్తి ప్రసంగించారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రపంచానికి యోగాను మన దేశమే పరిచయం చేసిందన్నారు. యోగా ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు అనేక దేశాలు యోగాను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయాలని చెప్పారు. ఇవన్నీ ముందుగా గురువుల సమక్షంలో అభ్యసించాలని, వీడియోలు చూసి నేర్చుకుని యోగా చేయవద్దని సూచించారు. ఆసనాలు వేయడం ద్వారా శారీరక పటుత్వం కలుగుతుందని, రోజంతా చలాకీగా ఉంటారని తెలిపారు. అనంతరం లైఫ్ అచీవ్‌మెంట్ సాధించిన డాక్టర్ చంద్రశేఖర్‌ను హార్ట్ ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర కల్కూర, వెంకటరాముడు, వాసు, లక్ష్మన్న, ఎలమర్తి రమణయ్య, భవానీ ఘనంగా సన్మానించారు.

ఉషా జట్టు ఎంపిక

కర్నూలు(రూరల్): నగరంలోని పెద్ద మార్కెట్ బాలికల పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి సబ్ జూనియర్, జూనియర్ ఉషా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఉషా సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. పోటీలకు 60 మంది హాజరయ్యారని, మంచి ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 15,16 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉషా సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి శ్రీనివాసులు, శిక్షకులు చిన్న శ్రీను, క్రాంతి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలి

కర్నూలు (రూరల్): జిల్లాలోని రైతులందరికీ సాగు పెట్టుబడి కింద ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథం ఆదివారం డిమాండ్ చేశారు. ఈ అంశంపై నేడు సంఘం ఆధ్వర్యంలో అన్ని సచివాలయాల్లో వినతి పత్రాలు ఇస్తామని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.



ఉచితంగా సేవలు

- జగనన్న సురక్షకు విశేష స్పందన
- నగరంలో తొలిరోజు వివిధ సేవల సర్టిఫికెట్లు అందజేత

కర్నూలు (టౌన్): గతంలో ఏ చిన్న సర్టిఫికెట్ కావాలన్నా మండల కార్యాలయాలకు పరుగులు తీయాలి. దరఖాస్తు చేసుకొని రోజుల తరబడి వేచి ఉండాలి. ఒక్కోసారి సర్టిఫికెట్ సరైన సమయంలో అందక పలువురు ప్రభుత్వ ఫలాలు కోల్పోయిన సందర్భాలూ ఉన్నాయి. ఇలా ఇంకెవరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి నగరంలో విశేష స్పందన లభిస్తోంది. సచివాలయాల్లో 11 రకాల సర్వీసులను ఉచితంగా అందజేస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న రోజు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ల అవసరం. దీంతో తొలుత వాటి మంజూరుకు అధికారులు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. జగనన్న సురక్ష ప్రారంభమైన శనివారం రోజే 121, 122 సచివాలయాల పరిధిలో 181 ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు,137 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నాలుగు బర్త్ సర్టిఫికెట్లు, ఒకటి డెత్ సర్టిఫికెట్ జారీ చేశారు. ఇవన్నీ పైసా ఖర్చులేకుండా ఉచితంగా ఇవ్వడంపై దరఖాస్తుదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పైసా ఖర్చులేకుండా సర్టిఫికెట్



కుల ధ్రువీకరణ పత్రం తీసుకుంటున్న ఈమె పేరు పుట్టా అనసూయ. 121 వ సచివాలయం ధర్మపేటలో నివసిస్తున్నారు. పిల్లల చదువుకోసం ప్రతి ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంలో కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ సమర్పించాలి. లేకపోతే ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ అందదు. దీంతో కుల ధ్రువీకరణ కోసం కర్నూలు మండలం తహసీల్దార్ ఆఫీసు చుట్టూ తిరగాలి. అక్కడ వీఆర్‌ఓ ఉంటే, ఆర్ఐ ఉండరు. వీరిద్దరు ఉంటే తహసీల్దార్ ఉండరు. ఆ ముగ్గురు ఉన్నా విచారణ చేసి ఇస్తామంటారు ఇవ్వరు. వారం పదిరోజులు గడిచినా పని కాదు. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత ఈ సమస్య తీరింది. దరఖాస్తు చేసుకున్న వెంటనే అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారు. ఇప్పుడు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఒక్క రూపాయి తీసుకోకుండా క్యాస్ట్ సర్టిఫికెట్ ఇవ్వడంపై పుట్టా అనసూయ సంతోషం వ్యక్తం చేశారు.

దరఖాస్తు చేసుకోగానే..



మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ నుంచి ఆదాయ ధ్రువీకరణ పత్రం తీసుకుంటున్న ఈమె పేరు వీరపోగు అలేఖ్య. 122వ సచివాలయ పరిధిలోని చల్లా కాంపౌండ్‌లో నివసిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, పిల్లలకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు కావాలన్నా ఆదాయ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. ఈ సర్టిఫికెట్ కోసం నానా ఆమె అవస్థలు పడేవారు. అన్ని ఆధారాలు సమర్పించినా ఏదో ఓ కారణం చెప్పి రెవెన్యూ అధికారులు తిప్పేవారు. తప్పని పరిస్థితిలో తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉండే దళారులను ఆశ్రయించి వారి ద్వారా సర్టిఫికెట్ పొందేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని దరఖాస్తు చేసుకుంటే ఇంటికే వచ్చి ఇస్తున్నారని అలేఖ్య చెబుతున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా దరఖాస్తు చేసుకున్న రోజే తనకు ఆదాయ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.